

పణవుర ఓవ్విల ణేజ్జణ విమ్హు అదక్తేత్తి
జారవేజ్జ ఘరవ్ఁ!
ణే ఉణేస హేకర ధారిల భుఅజా అలందోలిణీ
బాలా!!

(గాథా సప్తశతి)

"అమ్మో! తేలుకుట్టింది!
అబ్బో! తేలుకుట్టింది!
తేలంటే తేలుగాదు. ఎఱ్ఱతేలు - కుఱ్ఱతేలు
అమ్మో! నేనే దొరికానా? దీనికి!"
'అయ్యయ్యో! ఎక్కడ కుట్టిందే ఎక్కడ?
----ఇక్కడా?'

"కాదిక్కడ! అమ్మో! ఇదిగో యిక్కడ! ఇక్కడంటే యిక్కడేనా ఎక్కడెక్కడో ప్రాకుతూంది! వర

## మాయదారి తేలు

వరాల్లో విందుతూంది. ఏమేమో చేస్తూంది!"

ఆమె ఒకసారి చేయి చూపిస్తుంది. ఒకసారి కాలు చూపిస్తుంది. మరోసారి వేలు చూపిస్తూంది.

"పాపం! ఈ బాధలో అసలెక్కడ కుట్టిందో కూడా తోచటం లేదు"

"అయ్యో! ఎంతగా కుట్టిందో!"

"అబ్బో! ఎక్కడెక్కడ కుట్టిందో!"

"అమ్మో! ఎన్నిసార్లు కుట్టిందో!"

——చూపరుల సానుభూతులు పెరిగిపోతున్నాయి.

ఆమె చేతులు విదిలిస్తూంది. కాళ్లు కదిలిస్తూంది. ఎద వదిరిస్తూంది. రెప్పలాడిస్తూంది. ముఖం చిట్లిస్తూంది.

"ఏం తేలోనమ్మా మాయదారి తేలు"

ఆమె ఆయాసపడుతూంది. గసపెడుతూంది. నసపెడుతూంది.

ఎప్పుడూ ఆమెతో కలిసి తిరిగే స్నేహితురాలు ఓదారుస్తూంది.

అబ్బ! కాస్త ఓపిక పట్టవే ఏదో మందు వేయిద్దాం'

ఇలా ప్రక్కకు తిరిగి "ఏమండీ! మగవాడై వుండీ, మొగుడైవుండీ కూడా - మీ భార్య అలా బాధపడుతూంటే ఏమీ పట్టించుకోరేం? క్షమలెండి! యింటిదాని ఆలనా పాలనా ఎప్పుడు మీరు చూచుకున్నారు గనుక!? అందుకే రోజులిలా మండిపోతున్నాయి! ఆ చేసే వైద్య మేదో నేనే చేయిస్తాను. పద! పదవే! పక్క వీథిలో మంచి వైద్యుడున్నాడు. ఆయన యువకుడు. ఉత్సాహవంతుడు. ఏ అర్ధరాత్రిలో వెళ్లినా రోగిని కాదనడు. పద! పద!!"

ఇంటి యజమాని సమాధానం కోసం కూడా చూడ లేదామె. ఆమెను తన రెండు చేతులతో పట్టి భుజాన వేసుకుని గబగబ వెళ్లిపోయింది.

ఈ సవ్వడికి చుట్టు పట్టు అమ్మలక్కలందరూ గుమి గూడారు.

'ఏమే! కోడలా! అసలూ నిజంగా ఈ పిల్లకి తేలు కుట్టిందంటావా?" ఓ అత్త ప్రశ్న!

"ఊ! చెబుతూందిగా నరనరానికి ప్రాకిందని. పాపం అదెంత ఘాటైనతేలో!" ఎగతాళిగా ఓ కోడలి సమాధానం.

"మొగుడు అదవా - ఎదవా అయితే——
వంగనాచులిలాగే చేస్తారు! ఏమంటావొదినా?"

"అదవైతే మాత్రం - అందరూ యిలా వుంటారా వొదినా! వాళ్ల వాళ్ల పుటక అలాంటిది గానీ!" మరో పతివ్రత ఓ అభిప్రాయం విసిరింది.

"హక్కా! అసలు నీకీ సంగతి తెలుసా?" బొంగురు గొంతుకతో ఏదో చిదంబర రహస్యం చెప్పబోతూంది ఓ చిట్టెమ్మ.

"ఆ వైద్యుడు -- అసలు మంచోడు కాదంట--
ఆడాళ్లంటే ----"అర్ధోక్తిలో ఆపేసింది.

ఇంతలో———

క్రమం తప్పకుండా శ్రద్ధగా గంటకోసారి మందు వేయించుకోవాలిట. అందుకై ఈ రాత్రి వైద్యుడి యింట్లోనే వుండాలిట."

ఓ కుఱ్ఱవాడీ కబురు యింటి యజమానితో చెబుతూండగా అంతా బొమ్మల్లా నిలబడి విన్నారు.

ఒకరికి అశక్తి! — ఒకరికి ఆసక్తి!!
ఒకరిది రక్తి! — మరొక్కరిది యుక్తి!!

ఆహా! లోక మంటే యిదేననిపించింది.

—మాడుగుల నాగఫణిశర్మ

## కాలమ్ దాటని కథ

పోలీసువారు గ్రామంలోకి వచ్చారు దొంగతనం చూపే తీయడానికి. ఊరు బయటి ఇళ్లవాళ్లు దొంగలు పారిపోతూ వుంటే చూశామనీ, వారి చేతిలో ఏమి కనబడలేదనీ చెప్పారు. అయితే ఊళ్లో సొత్తు పోయిన వాళ్ల మాత్రం గోలుగోలున ఏడుస్తున్నారు. సొత్తు గ్రామంలోనే ఉండి వుండాలని పై సాక్ష్యం ప్రకారం పోలీసుల నమ్మకం. ఊరి మధ్య అందరినీ సమావేశ

### గుభేల్ దస్త్రం

పరిచారు. ఒక్కొక్కరిని మీ కేమైనా తెలిస్తే చెప్పమంటున్నారు.

ఆ గ్రామస్థులలో ఒక అమాయకుడు కూడా వున్నాడు. అతనికి జ్ఞాపకం తక్కువ. ఊళ్లో మాటల మీద ఆసక్తి ఎక్కువ. అందుచేత వీధిలో ఎవరు ఏమి మాట్లాడుకున్నా, మాట్లాడకుండా వచ్చి ఇంట్లో దస్త్రంలో ఎక్కించి వేసేవాడు. 'గొడ్లకాడ బుడ్డాళ్ల' మాటలూ, నీలాటి రేవులో ఆడవాళ్ల కబుర్లూ కూడా దస్త్రంలోకి ఎక్కించడం చూసిన వాళ్లు అతణ్ణి పిచ్చివాడి క్రింద జమకట్టి వేళాకోళం చేసేవారు. అప్పుడే అతడు సమావేశానికి వచ్చాడు.



"అన్ని మాటలూ దస్త్రంలోకి ఎక్కిస్తావు కదా! నిన్న రాత్రి దొంగల మాటలు ఎక్కించలేకపోయావేం?" అని ఒకడు ఎగతాళి చేశాడు. "నేను నిద్ర పోతున్నా. వింటే ఎక్కించేవాడినే! అయినా అర్ధరాత్రి మూడు గుభేళ్లు వ్రాశాను" అన్నాడు. గుభేళ్లేమిటన్నారు పోలీసులు. "మా ఇంటి ప్రక్క నూతిలో శబ్దాలు" అన్నాడు. పోలీసులు నూతిలో దిగి గాలిస్తే సొమ్ము దొరికింది. అప్పటి నుంచి అతడు వ్రాసే డైరీ "గుభేల్ దస్త్ర" మయింది.

-పైడిపాటి సుబ్బరామశాస్త్రి.